నామినేషన్ ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి

- ఆర్‌ఓ కార్యాలయం వద్ద మూడంచెల భద్రత
- అందుబాటులో నామినేషన్, అఫిడవిట్ పత్రాలు
- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఆర్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి



గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గం 52.. నామినేషన్ ప్రక్రియకు ఏర్పాటు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ ఆఫీసర్ బి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నవంబర్ 3 నుంచి 10 వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. నామినేషన్ పత్రాలు, నమూనా అఫిడవిట్‌లు ఈసీఐ వెబ్ సైట్లో లేదా ఆర్‌ఓ కార్యాలయంలో తీసుకోవచ్చన్నారు. ఎన్నికల నియమావళిని అభ్యర్థులు తప్పక పాటించాలని ఆయన సూచించారు. ఆర్‌ఓ కార్యాలయానికి 100 మీటర్ల దూరం వరకు మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని, ఆర్‌ఓ కార్యాలయం వద్ద మూడంచెల భద్రత ఉంటుందన్నారు. ఆర్‌ఓ కార్యాలయానికి వచ్చే ప్రధాన రహదారి వద్ద, ఆఫీస్ ప్రధాన ద్వారం వద్ద, ఆర్‌ఓ చాంబర్ ద్వారం వద్ద భద్రత ఉంటుందన్నారు. అభ్యర్థితో పాటు మరో నలుగురు మాత్రమే ఆర్‌ఓ కార్యాలయంలోకి రావొచ్చని వివరించారు. నవంబర్ 13న నామినేషన్ల ఉపసంహరణ, 15న విత్‌డ్రాలు ఉంటాయని తెలిపారు. నామినేషన్ వేసినప్పటి నుంచి అభ్యర్థి ఖర్చు వెలకట్టడం ప్రారంభమవుతుందని, రూ.40 లక్షల వరకు ఖర్చు చూపించాలన్నారు.అభ్యర్థులు చేపట్టే ప్రచారం, ర్యాలీలు, బహిరంగ సభలు తదితర కార్యక్రమాలపై షాడో టీమ్‌లు పర్యవేక్షణ చేసి ఖర్చును అంచానా వేస్తాయన్నారు. వాస్తవ ఖర్చును లెక్కిస్తుందని, రూ.40 లక్షలు దాటితే అభ్యర్థి డిస్క్వాలిఫై అవుతారని ఆర్‌ఓ శ్రీనివాస్ రెడ్డి ‘సాక్షి’కి తెలిపారు. ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు కార్యాలయంలో ఆర్‌ఓ స్వీకరిస్తారని, ప్రతి రోజు ఎన్ని నామినేషన్లు వచ్చాయో నోటీసులు బోర్డులో తెలియజేస్తామన్నారు.

నామినేషన్ నిబంధనలివే...

- అభ్యర్థి పేరిట లేదా అభ్యర్థి, ఏజెంట్ జాయింట్‌గా కొత్తగా తీసుకున్న బ్యాంక్ అకౌంట్ వివరాలు ఇవ్వాలి.
- కొత్తగా తీసుకున్న అకౌంట్ నుంచే ఖర్చుల లావాదేవీలు జరపాల్సి ఉంటుంది.
- నామినేషన్ ఫారం-2(బి), ఫారం-26 జత పర్చాలి.
- అభ్యర్థి వేరే నియోజకవర్గానికి చెందిన వారైతే సర్టిఫైడ్ ఎలక్టోరల్ సర్టిఫైడ్ పత్రాలు జత పర్చాలి.
- ఎన్నికల కమిషన్ గుర్తించి, రిజిస్టర్డ్ అయిన జాతీయ, ప్రాంతీయ పార్టీల అభ్యర్థులకు ఒక ప్రతిపాదకుడు ఉంటే సరిపోతుంది.
- రిజిస్టర్ కాని, గుర్తింపు లేని ఇండిపెండెంట్ అభ్యర్థులకు 10 మంది ప్రతిపాదకులు అవసరం ఉంటుంది.
- అఫిడవిట్‌లో ఉన్న కాలమ్స్ తప్పని సరిగా పూరించాలి. ఏ కాలాన్ని ఖాళీగా వదలకూడదు. నోటరీ చేసిన అఫిడవిట్‌ను జతపర్చాలి.
- నామినేషన్ అభ్యర్థులు 2 సెం.మీ, 2.5 సెం.మీ లేటెస్ట్ ఫొటోలు అందజేయాలి.
- నామినేషన్ వేస ఎస్‌సీ, ఎస్‌టీ అభ్యర్థులు తప్పనిసరిగా కుల ధృవీకరణ సర్టిఫికెట్ జతపర్చాలి.
- అభ్యర్థి జైలు శిక్ష అనుభవించినా, నేర నిరూపణ అయినా వివరాలను డిక్లేర్ చేయాలి.
- అభ్యర్థులు రూ.10 వేల నగదు మాత్రమే సెక్యూరిటీ డిపాజిట్‌గా ఆర్‌ఓ కార్యాలయంలో చెల్లించాలి.
- ఎస్‌సీ, ఎస్‌టీ అభ్యర్థులు రూ.5 వేల నగదు చెల్లిస్తే సరిపోతుంది.
- నామినేషన్ వేసిన అభ్యర్థి రిటర్నింగ్ ఆఫీసర్ ముందు ప్రతిజ్ఞ చేయాల్సి ఉంటుంది.
- నామినేషన్ ప్రక్రియను ఫొటో, వీడియో తీస్తారు.
- విత్‌డ్రాలు ముగిసిన అనంతరం ఆయా అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తారు.

భూ వరాహస్వామికి ప్రత్యేక పూజలు

హఫీజ్‌పేట్ : చందానగర్‌లోని విశాఖ శ్రీ శారద పీఠ పాలిత శ్రీ వెంకటేశ్వరస్వామి సముదాయంలో బుధవారం శ్రీ భూ వరాహస్వామి ద్వితీయ వార్షికోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచన, దీక్షా ధారణ, మండపారాధన, స్వామివారికి విశేష పంచామృతాభిషేకం, విశేష అలంకారం, ప్రధాన హోమాలు, పుర్ణాహుతి, శాంతి కళ్యాణం, తీర్థప్రసాదములు, అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. ఈ పూజల్లో దేవాలయ కమిటి ప్రధాన కార్యదర్శి సుభాష్, సుమతి, అధ్యక్షులు రఘుపతిరెడ్డి, నిర్మల, ఉపాధ్యక్షులు సుబ్బారాయుడులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి సువర్ణతాపడ బంగారు ఆభరణాలను ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి టి.సుభాష్, సుమతిలు సమర్పించారు.



స్వామివారికి ఆభరణాలు సమర్పిస్తున్న సుభాష్ కుటుంబ సభ్యులు

భారీ మెజార్టీతో గులాబీ జెండా ఎగురవేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: శేరిలింగంపల్లిలో భారీ మెజార్టీతో గెలిచి గులాబీ జెండాను మరోసారి ఎగురవేస్తామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్ కాలనీ బీ బ్లాక్‌వాసులతో ఆయన ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. శేరిలింగంపల్లిలో ప్రజల ఉన్న ఆదరణ చూస్తుంటే అధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వీరేశంగౌడ్, రాజుయాదవ్, క్రాంతి, జగన్‌మోహన్‌రావు, తిరుపతియాదవ్, రవిశంకర్, కార్తీక్, గోపాల్‌యాదవ్ పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2, షిరిడి హిల్స్ నగర్, చక్రధారినగర్ కాలనీల్లో ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో దొడ్ల రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, అనిల్ రెడ్డి, కాశీనాద్ యాదవ్, రాజేష్ చంద్ర, గుడ్ల శ్రీనివాస్, కృష్ణారావు, వెంకట్‌నాయక్, భాస్కర్ రెడ్డి, షౌకత్ ఆలీ మున్నా, మహిళా నాయకురాళ్లు రాజ్యలక్ష్మీ, సత్తూరి శిరీష, స్వరూపా, లావణ్య, దేవి, వల్లి, లక్ష్మమ్మ, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

కారు గుర్తుకే ఓటేద్దాం...



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, ఎమ్మెల్యే గాంధీ కుమారుడు పృథ్వీ, కుమార్తె ప్రణీత తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ అల్లాపూర్ సొసైటీలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కుమారుడు పృథ్వీ, కుమార్తె ప్రణీతలతో కలిసి హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు బుధవారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి తోడ్పడే విధంగా పార్టీ మ్యానిఫెస్టో ఉందన్నారు.

చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలి



వర్క్‌షాప్‌లో పాల్గొన్న వక్తలు

రాయదుర్గం: లైంగిక వేధింపులు లేని క్యాంపస్‌గా మనూ గుర్తింపు పొందేలా చేయాలని వక్తలు అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో ‘సెన్సిటైజేషన్ అండ్ అవేర్‌నెస్’పై వర్క్‌షాప్‌ను ‘మనూ’ అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ) ఆధ్వర్యంలో పనిప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల చట్టంపై అవగాహన కల్పించేందుకు రెండురోజుల వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మహిళలు పనిచేసే ప్రదేశాలలో ప్రశాంత, స్వేచ్ఛాయుత వాతావరణం ఉండేలా చూడాలన్నారు. మహిళల హక్కుల రక్షణ కోసం అమలు చేస్తున్న ప్రతి చట్టంపై మహిళలు అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో మై చాయిసెస్ ఫౌండేషన్ ప్రోగ్రామ్స్ హెడ్ డాక్టర్ ఫర్జానాబేగం, ఎంసీపీ కౌన్సిలింగ్ సెంటర్ సైకాలజిస్ట్ డాక్టర్ సుమన్‌రాయ్, ఐసీసీ చైర్‌పర్సన్ ప్రొ.గుల్ఫిషాన్ హబీబ్, రిసోర్స్‌పర్సన్ డాక్టర్ షకేరా పర్వీన్, డాక్టర్ షఫీక్ అహ్మద్, టి అరుంధతి, జే జ్యోతి ప్రసంగించారు.

భక్తులతో కిటకిటలాడిన గణేష్‌గడ్డ



సంకటహర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు

ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

పటాన్‌చెరు టౌన్: మండలంలోని రుద్రారం గణేష్ గడ్డ ఆలయంలో బుధవారం సంకటహర చతుర్థి సందర్భంగా స్వామివారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.అర్చకులు సంతోష్ జోషి, జగదీశ్వర్‌స్వామి, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ ఈఓ మోహన్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు మల్లికార్జున్, ఈశ్వర్లు తెలిపారు. ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమం సాగుతుందని వివరించారు.

గణేషుడికి బెల్లంతో అభిషేకం



రాయదుర్గం: సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. గణేషుడికి ఇష్టమైన బెల్లం ముద్దలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఆలయంలోని కాశీవిశ్వేశ్వరస్వామి, షిర్డీసాయిబాబా, ఆంజనేయస్వామి, అన్నపూర్ణాదేవికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, అలంకారం చేశారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డిపార్వతి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత.. ఐదుగురి రిమాండ్

మియాపూర్ : నిషేధిత గంజాయిని ప్రైవేటు బస్సులో తరలిస్తున్న ఐదుగురిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 307 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని బుధవారం రిమాండ్‌కు తరలించారు. మియాపూర్ సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...మియాపూర్‌లోని ఆల్విన్ ఎక్స్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం మియాపూర్ పోలీసులు, ఎస్‌ఓటీ పోలీసులు సంయుక్తంగా వాహన తనిఖీలు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు అటువైపు వచ్చిన బస్సును పోలీసులు తనిఖీ చేయగా భువనేశ్వర్ నుండి మహారాష్ట్ర పూనేకు గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు.మహారాష్ట్రకు చెందిన అతుల్ సదాశివ్ ఆవాద్ (41), పరుశు సత్యవాన్ దావ్రే (30), దీక్ష నర్సప్ప బండారి(28), బాబురావు తంబాజీ(52),ఆదిత్య కైలాష్ చాకోలే(20)లను అదుపులోకి తీసుకుని విచారించగా దేబానంద్ దాష్ అనే వ్యక్తి నుండి గంజాయి తీసుకుని ప్రైవేటు బస్సులో 307 కేజీల గంజాయిని తీసుకువేళ్తున్నట్లు తెలిపారు. మియాపూర్ పోలీసులు వారిని అరెస్ట్ చేసి గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అదేవిధంగా దేబానంద్‌దాష్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.



బస్సులో గంజాయిని తరలిస్తున్న దృశ్యం

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.. విశాఖపట్నం జిల్లా.. గోపాలపట్నంకు చెందిన అనంత్(28) బతుకుదెరువు కోసం సంవత్సరం క్రితం వచ్చి పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో కుటుంబంతో ఉంటున్నాడు. పాశమైలారం పారిశ్రామికవాడలో ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు.ఈ క్రమంలో 30వ తేదీ అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో భార్య దేవకి ను బయటకు పంపి డోర్ వేసుకున్నాడు. దీంతో భార్య స్థానికుల సహకారంతో తలుపులు తెరిచి లోనికి వెళ్లగా ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. దీంతో అనంత్‌కుమార్‌ను పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో పోలీసులు గోపాలపట్నంలో ఉన్న మృతుడి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా బుధవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ కి చేరుకుని తన కుమారుడు మద్యానికి బానిసై ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని అతడి మృతిపై ఎలాంటి అనుమానం లేదని మృతుడు తండ్రి లంక చిన్న రాజు పేర్కొన్నాడు.

మానసికస్థితి సరిగా లేక..

మానసిక స్థితి సరిగా లేని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ అశోక్ కథనం ప్రకారం...పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామానికి చెందిన శ్రీనివాసరావు(63) గత కొంతకాలంగా మానసిక స్థితి సరిగా లేక ఇబ్బంది పడుతున్నాడు.ఈ క్రమంలో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో కుటుంబ సభ్యులందరితో కలసి భోజనం చేసి పడుకున్నారు. బుధవారం ఉదయం తెల్లవారుజామున మృతుని భార్య వాష్ రూమ్‌కు వెళ్లేందుకు బయటకు రాగా ఇంటి స్లాబ్ సీలింగ్ కు తాడుతో ఉరి వేసుకుని శ్రీనివాసరావు కనిపించాడు.వెంటనే పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకి తరలించారు.మృతుడి కుమారుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గణనాథుడికి ఎమ్మెల్యే పూజలు

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియనగర్‌లోని శ్రీ సిద్ధి వినాయక స్వామి ఆలయంలో నిర్వహించిన మోదక హోమంలో స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పాల్గొన్నారు. మాదాపూర్ డివిజన్ ఆదిత్యనగర్‌కు వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ సమక్షంలో బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు.

అనుమతులు లేని నిర్మాణాల కూల్చివేత

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని ఖాజీపల్లి గ్రామ శివారులో గల 180/10 సర్వేనంబర్‌లో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన రేకుల షెడ్డును బుధవారం గ్రామ పంచాయతీ అధికారులు కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఈఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అనుమతులు లేకుండా షెడ్డు వేయటంతో సంబంధిత వ్యక్తికి నోటీసులు ఇచ్చామన్నారు. నోటీసులకు సరైన సమాధానం ఇవ్వకపోవటంతో కూల్చివేయించామన్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నేడు మహంకాళి ఆలయ వార్షికోత్సవం



పటాన్‌చెరు టౌన్: మహంకాళి ఆలయం 22వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం అమ్మవారికి పంచామృత ఫలరసాల అభిషేకం, గణపతి పూజ ప్రధాన దేవతల మండపారాధన 10 గంటలకు చండీ సప్తశతి హోమం జరుగుతుందని ఆలయ గౌరవ అధ్యక్షులు సపాన్‌దేవ్ తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని, అదేవిధంగా సాయంత్రం 6 గంటలకు దేవాలయ ప్రాంగణంలో దీపాలంకరణ, లలితా సహస్ర పారాయణం, పుష్పార్చన ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మహా కుంభాభిషేకం

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కొలువుదీరిన శ్రీ అయ్యప్ప స్వామి ద్వితీయ పుష్కర మహా కుంభాభిషేకం వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఈనెల 1 నుంచి 5వ తేదీ వరకు జరగనున్న వేడుకల్లో భాగంగా బుధవారం ఉదయం మహాగణపతి హోమం, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

చోరీకి పాల్పడిన వ్యక్తిపై కేసు

పటాన్‌చెరు టౌన్: పూజాసామగ్రి దుకాణంలోకి చొరబడి చోరీకి పాల్పడిన వ్యక్తిని దేవస్థానం సెక్యూరిటీ పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారంలో చోటుచేసుకుంది. స్థానికులు, ఆలయ సెక్యూరిటీ తెలిపిన వివరాలు ప్రకారం.. పటాన్‌చెరు మండలం రుద్రారం గణేష్‌గడ్డ దేవస్థాన సమీపంలో ఉన్న పూజ సామగ్రి దుకాణం షట్టర్‌ను మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి తెరిచి అందులో నగదును ఎత్తుకొని పరారీ అవుతున్న క్రమంలో ఆలయ సెక్యూరిటీ పట్టుకుని చెట్టుకు కట్టేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో చోరీకి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా నర్సాపూర్ సిద్ధరామ్‌పూర్ కాలనీకి చెందిన వడ్డే కుమార్‌గా గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

‘ఆమ్‌ఆద్మీ’ కార్యాలయంపై దాడి.. ఫిర్యాదు



సీఐ ప్రేమ్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు

మియాపూర్ : ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంపై మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేసి వాహనాలను ధ్వంసం చేశారు. మియాపూర్‌లోని సుభాష్‌చంద్రబోస్ నగర్ కాలనీలో ఉన్న పార్టీ కార్యాలయం వద్ద కొందరు వ్యక్తులు ఆమ్‌ఆద్మీ పార్టీకి చెందిన వాహనాలను, సామగ్రిని, జెండాలను ధ్వంసం చేశారు. ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ నాయకులు మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు సీఐ ప్రేమ్ కుమార్ తెలిపారు. ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ సుధాకర్ ,శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మహ్మద్ అల్లావుద్దీన్ పటేల్, నాయకులు మహ్మద్ మాజీద్, హేమా జిల్లోజు, అబ్దుల్ ముక్తేదీర్, సాదిక్‌బీన్, యూసఫ్, శ్రీకాంత్, షరీఫ్ ,శ్రీకాంత్ తదితరులున్నారు.

భవన నిర్మాణ కార్మికులు గుర్తింపు కార్డులు పొందాలి

సీఐటీయూ నాయకులు

ఆల్విన్‌కాలనీ: పాపిరెడ్డి నగర్‌లోని సీఐటీయూ, లేబర్ ఆఫీస్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు బుధవారం సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా నాయకుడు ఎం.శంకర్, ధర్మారావు, రంగారెడ్డి, నరసమ్మ పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నుండి గుర్తింపు కార్డులు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్డులు పొందిన లబ్ధిదారులకు ప్రమాద బీమా రూ.6 లక్షలు, సాధారణ మరణానికి లక్షా ముప్పైవేల రూపాయలతో పాటు, మ్యారేజి గిఫ్ట్ కింద 30 వేల రూపాయలను అందజేస్తారన్నారు.సుమారు 60 మంది వైద్య, రక్త పరీక్షలు చేయించుకున్నారు. సాయిలు, శివయ్య, కృష్ణ, విజయ, సునీత, రాములు, కృష్ణ, బాబురావు, శర్మ, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు వైద్య పరీక్ష చేస్తున్న వైద్యులు

వైశ్వనార చిత్రప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ఆర్ట్ గ్యాలరీలో బుధవారం కళాకారుడు దేవులపల్లి హనుమంతరావు వేసిన చిత్రాలను వైశ్వనార పేరిట చిత్రప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి, శిల్పారామం ప్రత్యేక అధికారి కిషన్‌రావు ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో 32 చిత్రాలను అందుబాటులో ఉంచామని, ఈనెల 8వ తేదీ వరకు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. కార్యక్రమంలో కళాకారులు అంజుపొద్దార్, వినీత్‌సింగ్ రానావత్, అలేఖ్య హోమ్స్ ఎండి కుద్ర శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.





చిత్రాలను చూస్తున్న ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి తదితరులు

13 మందికి జరిమానా..

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ 13 మంది వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమ, మంగళవారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 11 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేల జరిమాన, ఇద్దరికి రూ.3 వేల జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

బెల్ట్‌షాపులపై దాడి.. మద్యం స్వాధీనం

పటాన్‌చెరు టౌన్: బెల్ట్ షాపుల తనిఖీలు ముమ్మరం చేశామని ఎక్సైజ్ సీఐ సీతారామిరెడ్డి అన్నారు.బుధవారం అమీన్‌పూర్ మండల పరిధిలోని కిష్టారెడ్డిపేట్‌లో స్వామి అనే వ్యక్తి బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నాడనే విశ్వసనీయ సమాచారం రావడంతో దాడులు నిర్వహించి రూ.3 వేలు విలువ చేసే మద్యంను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో...

అమీన్‌పూర్ మండల పరిధిలోని నరగ్రూడెంలో రాజీవ్‌గృహ వద్ద ప్రసాద్ అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో ఎస్సై మల్లయ్య సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి రూ.8,100 విలువ చేసే మద్యంను స్వాధీనం చేసుకుని, విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

రెండు కార్లు ఢీ.. ఆరుగురికి గాయాలు

హఫీజ్‌పేట్ : చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పీజేఆర్ రోడ్డులో బుధవారం తెల్లవారుజామున రెండు కార్లు ఢీకొన్నాయి. జాతీయ రహదారి నుంచి పీజేఆర్ ఎన్‌క్లేవ్‌కు వెళ్ళే కారు అపర్ణా అపార్ట్‌మెంట్స్ నుంచి వస్తున్న కారును ఢీకొట్టడంతో రెండు కార్లు నుజ్జునుజ్జు అయ్యాయి. ఈ ఘటనలో ఆరుమందికి చిన్నపాటి గాయాలయ్యాయని చందానగర్ పోలీసులు తెలిపారు.



సమష్టిగా పని చేయాలి

రాయదుర్గం: బీఆర్‌ఎస్ విజయం కోసం అందరూ సమిష్టిగా పని చేయాలని గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా సూచించారు. బుధవారం గచ్చిబౌలి డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ఖాజాగూడలో గోపన్‌పల్లికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో గోపన్‌పల్లికి చెందిన మున్నప్ప, నర్సింహ, రాములు, మైసమ్మ, లక్ష్మీ ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరగా సమావేశంలో నాయకులు రమేష్‌గౌడ్, జంగయ్యయాదవ్, రాజుముదిరాజ్, జగదీశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు



పార్టీలో చేరిన వారితో అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి: కాంగ్రెస్ పార్టీలోకి శేరిలింగంపల్లిలోని పలు ప్రాంతాల నుంచి చేరికలు పెరుగుతున్నాయని ఆ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి వి.జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. బుధవారం నల్లగండ్లలో హైదర్‌నగర్‌కు చెందిన శ్రీకాంత్‌గౌడ్, ఫయాజ్, నర్సింగ్, రాములు ఆధ్వర్యంలో పలువురు జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ ఓటర్లకు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హైదర్‌నగర్ డివిజన్ నాయకులు వెంకటేష్ యాదవ్, రాజిరెడ్డి, యాదగిరిగౌడ్, అర్జున్, విష్ణు, రాములు, శ్రీను, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం..

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ జన్మభూమి కాలనీలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్‌కు మద్దతుగా కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. బుధవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో ఇంటింటి ప్రచారంలో ఆరు గ్యారెంటీలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుజాత, మణెమ్మ, రాజా, రూబెన్, నారాయణ, విజయకుమార్, రెహమాన్, శివ తదితరులు పాల్గొన్నారు.

హింసను ప్రేరేపించడం అవివేకం

- క్రమశిక్షణ నేర్పిన అధినేత సీఎం కేసీఆర్
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): దాడులను తిప్పి కొట్టడం తమకు చేతకాక కాదని, తమ అధినేత కేసీఆర్ క్రమశిక్షణ, ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని నేర్పించారని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, మాజీ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక లక్ష్మీ గార్డెన్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తున్నామన్నారు. ప్రతిపక్ష పార్టీలు అయోమయస్థితిలో ఉండి వారి కార్యకర్తలను రెచ్చగొడుతున్నాయని ధ్వజమెత్తారు. హింసతో ఎవరు ఏమీ సాధించలేరని హితబోధ చేశారు. కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి కోడి కత్తి డ్రామా అనడం సిగ్గుచేటని, ఆయన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. హింసతో ఓట్లు రాబట్టాలని చూస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని, వారికి సరైన గుణపాఠం నేర్పుతారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పనగేశ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, సీనియర్ నాయకులు నగేశ్, ఆదర్శ్ రెడ్డి, మిరాజ్ ఖాన్, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గోవింద్, సర్కిల్ అధ్యక్షుడు పరమేశ్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఐలేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల సమావేశం

పటాన్‌చెరు: అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసే కాంగ్రెస్, బీజేపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలో బుధవారం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం మండలంలోని కొడకంచి ఉపసర్పంచ్ అభిలాష్‌గౌడ్, మాజీ సర్పంచ్ పెంటాగౌడ్, మాజీ ఉపసర్పంచ్ నర్సింగ్‌రావు తమ అనుచరులతో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, వెంకటేష్‌గౌడ్, సర్పంచ్ శివరాజ్, పార్టీ అధ్యక్షులు రాజేష్ పాల్గొన్నారు.